పాలిటెక్నిక్‌తో కొలువులు కోకొల్లలు

- డిప్లొమా పూర్తి చేస్తే ముందేగా ఉద్యోగావకాశాలు
- పదో తరగతి అర్హతతో పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు
- ఐదు కళాశాలలు.. 960 సీట్లు
- రేపటి నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 18: లక్షలు వెచ్చించి కార్పొరేట్ విద్యను అందిపుచ్చుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఓ వరం. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ చదివేందుకు అర్హులే. పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి బ్రాంచ్‌ల్లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 5 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలుండగా మొత్తం 960సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. పదో తరగతి ఉత్తీర్ణులై డిప్లొమా పూర్తి చేస్తే అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి. అప్పుడే ఉద్యోగం ఎందుకు ఉన్నత విద్య చదువుకోవాలనుకునే వారికి ఎమ్‌సెట్‌తో పనిలేకుండా డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ ద్వారా నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరి మూడు సంవత్సరాల్లో చదువు పూర్తి చేయవచ్చు.

ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్	జూన్ 20 నుంచి 24
ధ్రువపత్రాల పరిశీలన	జూన్ 22 నుంచి 25
ఆప్షన్ల ఎంపిక	జూన్ 22 నుంచి 27
సీట్ల కేటాయింపు	జూన్ 30
ఫీ పేమెంట్, సెల్ఫ్ రిపోర్టింగ్	జూన్ 30 నుంచి జూలై 4

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర సాంకేతిక శిక్షణ సంస్థ ఈ మేరకు కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. పాలిసెట్ రాయని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా కౌన్సెలింగ్ తర్వాత ప్రవేశం పొందే అవకాశం కల్పించారు.

జిల్లాలోని కళాశాలల వివరాలు

జిల్లాలో మొత్తం ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 960 సీట్లు ఉన్నాయి. సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో 60 సీట్లు, ఈఈఈలో 60 సీట్లు ఉన్నాయి. జహీరాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈలో 120 సీట్లు, సివిల్ 120 సీట్లు, మెకానికల్ 120 సీట్లు, ఆటోమొబైల్‌లో 60 సీట్లు ఉన్నాయి. జోగిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో 60 సీట్లు, ఈఈఈలో 60 సీట్లు, మెకానికల్‌లో 60 సీట్లు, జోగిపేట బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో 60 సీట్లు, కంప్యూటర్స్‌లో 60 సీట్లు, నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో 60 సీట్లు, ఈఈఈలో 60 సీట్లు ఉన్నాయి.

భవితకు బంగారు బాట పాలిటెక్నిక్

పాలిటెక్నిక్‌తో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ విద్య కంటే డిప్లొమా చదవడం తేలిక. ఫీజు కూడా చాలా తక్కువే. అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తారు. డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం చేసేవారికి పార్ట్ టైం పద్ధతిలో ఇంజినీరింగ్ కూడా చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. డిప్లొమా చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. మా కళాశాల విద్యార్థులు ఆల్ఫా ఇంటర్నేషనల్, ఆదిత్య బిర్లా, ఎవర్టన్ ఎనర్జీస్ వంటి సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందారు.

- డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఘనపూర్ గ్రామస్తులు

ఎల్లమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

పటాన్‌చెరు, జూన్ 18: రేణుకాఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి కృపతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యంతో ఉండాలని కోరుకున్నారు. ఘనపూర్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదన్నారు. తాను ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామ సమగ్రాభివృద్ధికి నిధులు అందేలా చేశానన్నారు. కార్యక్రమం లో దశరథరెడ్డి, మాజీ సర్పంచ్ కావ్య, కాశిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

పాఠశాలల నిర్మాణాలను పూర్తి చేయాలి

రామచంద్రపురం ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రపురం, జూన్ 18: రామచంద్రపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను మంగళవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్పొరేటర్ పుష్పానగేశ్‌తో కలిసి పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు పరమేశ్ యాదవ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యమకారుల సమావేశం

కోహీర్, జూన్ 18: తెలంగాణ సాధనలో ప్రత్యేక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ఉద్యమకారుడు పరశురాములు(ప్రశాంత్) కోరారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలో ఉద్యమకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఉద్యమకారులను గుర్తించి ప్రత్యేక గుర్తింపు పత్రం, నెలనెలా పింఛన్, ఆర్టీసీ బస్సు, రైలు ప్రయాణ చార్జీల్లో రాయితీలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5లక్షల సహాయం ఇవ్వాలని వినతిపత్రం అందజేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి జిల్లాలోని ఉద్యమకారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆల్బెండజోల్ మాత్రలు అందించాలి

కోహీర్, జూన్ 18: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతోపాటు పాఠశాలల్లోని విద్యార్థులకు 20వ తేదీన అల్బెండజోల్ మాత్ర వేయాలని సూచించారు. 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారిని గుర్తించి మాత్రలను అందజేయాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాతనే మందు వేయాలన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంధ్యారాణికి డాక్టరేట్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 18: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల బోధకురాలు సంధ్యారాణికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంగ్ల శాఖ ఆచార్యులు డాక్టర్ కొండా నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో 'ఎన్హాన్సింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఆఫ్ పాలిటెక్నిక్ స్టూడెంట్స్ ఏ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ పాలిటెక్నిక్ కాలేజెస్' అనే అంశంపై సంధ్యారాణి పరిశోధన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాబాయి, అధ్యాపకులు సంధ్యారాణిని అభినందించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

న్యాల్‌కల్, జూన్ 18: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో సీఎం ప్రత్యేక నిధుల కింద మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సునీల్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు శాంత్‌కుమార్‌పాటిల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కోహీర్, జూన్ 18: జహీరాబాద్ పట్టణంలోని రైల్వే పట్టాల సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఎల్ల అంగడి బజార్ రైలు పట్టాల సమీపంలోని కానుగ చెట్టుకు వారం క్రితం తన లుంగీతో ఉరేసుకున్నాడన్నారు. అతడి వయసు 45 నుంచి 50 ఉంటుందన్నారు. వారం క్రితం చనిపోవడంతో అతడి శరీరం పూర్తిగా నీలి రంగులోకి మారిపోయిందని, మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచినట్లు తెలిపారు. అతడిని ఎవరైనా గుర్తిస్తే జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై కోరారు.

ఇండ్ల స్థలాల పరిశీలన

జిన్నారం, జూన్ 18: ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఇండ్ల స్థలాలను కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున హద్దులను తొలిగించి చదును చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ బీట్ ఆఫీసర్‌తో కలిసి చదును చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఇండ్ల స్థలాల హద్దులను తొలిగించి చదును చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, సంబంధిత వ్యక్తులపై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు.

బస్సు సర్వీసు ప్రారంభం

జిన్నారం, జూన్ 18: ప్రజల అవసరాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్ డిపో నుంచి పటాన్‌చెరు వరకు బస్సు సర్వీసును మంగళవారం జిన్నారంలో ప్రారంభించారు. నర్సాపూర్ నుంచి రాళ్లకత్వ, మంగంపేట, జిన్నారం, ఊట్ల, సోలక్‌పల్లి, శివనగర్ మీదుగా పటాన్‌చెరు వరకు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సు నడుస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగురమేశ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పుట్టి భాస్కర్, జింకల రవీందర్, నరేందర్, భాస్కర్, మహేందర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని క్లినిక్ సీజ్

చింతల్‌చెరులో ప్రైవేట్ క్లినిక్ సీజ్‌చేస్తున్న జిల్లా వైద్యాధికారిని గాయత్రీదేవి

హత్నూర, జూన్ 18: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చింతల్‌చెరులో రవీందర్ అనేవ్యక్తి ఆర్ఎంపీగా చెలామని అవుతూ గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది బెడ్లు ఏర్పాటుచేసి వైద్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. సిరంజీలను వేడిచేసి మళ్లీమళ్లీ వాడుతూ నీడిల్ మారుస్తున్నారని, బయోమెడికల్ వేస్టేజ్‌ను సంచుల్లో నింపి క్లినిక్ ఆవరణలో ఉంచి రోగాల వ్యాప్తికి కారకుడయ్యాడని తెలిపారు. క్లినిక్ వద్ద ప్రైవేటుగా మెడికల్ షాప్ ఏర్పాటు చేసి పదో తరగతి చదివిన అమ్మాయితో మందులు విక్రయిస్తుండటంతో ఈ విషయాన్ని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక వైద్యాధికారి నేత్రావతి ఉన్నారు.

పటాన్‌చెరును అభివృద్ధి చేశాం

మాట్లాడుతున్న ఎంపీపీ సుష్మ

పటాన్‌చెరు, జూన్ 18: పటాన్‌చెరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మండల అధ్యక్షురాలు సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సహకారంతో అనుకున్న స్థాయిలో పనులు జరిగాయన్నారు. అందరి సహకారంతోనే పటాన్‌చెరుకు ఉత్తమ మండలం అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. ఇస్నాపూర్ ఎంపీటీసీ గడం శ్రీశైలం మాట్లాడుతూ ఇస్నాపూర్‌లో పరిధిలోని చెరువులు, కుంటల శిఖంలో రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమంగా ఇండ్లు నిర్మిస్తున్నారని మండిపడ్డారు. ఒక ఆర్ఐ ఎఫ్‌టీఎల్‌లో ఇంటిని నిర్మించాడని ఆరోపించారు. తాగునీటి సరఫరాలో మిషన్ భగీరథ అధికారులు విఫలమయ్యారన్నారు. ముత్తంగిలోనూ చెరువులు కబ్జాకు గురవుతున్నాయని వాపోయారు. పీసీబీ అధికారులు సమావేశానికి రాకపోవడంపై ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నంది గామ గ్రామంలోని కిరాణాల్లో గంజాయి అమ్ముతున్నారని మండిపడ్డారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ మౌనం వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఎంఈవో పీపీ రాథోడ్, మండల వ్యవసాయ అధికారి ఉషా, ఎంపీవో హరిశంకర్, వైస్ ఎంపీపీ స్వప్నాశ్రీనివాస్, ఎంపీటీసీలు గడీల కుమార్‌గౌడ్, అంజిరెడ్డి, నాగజ్యోతి లక్ష్మణ్, మన్నె రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు, కాలుష్యాన్ని అరికట్టాలి

మాట్లాడుతున్న ఆర్డీవో వసంతకుమారి

సంగారెడ్డి, జూన్ 18: ప్రమాదాల నివారణకు పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, కాలుష్యాన్ని అరికట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వసంతకుమారి సూచించారు. మంగళవారం కార్యాలయంలో పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ, కాలుష్యం అరికట్టడంపై ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి పరిశ్రమలో పటిష్టమైన యంత్రాంగం ఉండాలని, ప్రమాదాలు చోటు చేసుకున్నపుడు వెంటనే స్పందించాలన్నారు. ప్రతి పరిశ్రమ ప్రమాదకరమైన రసాయనాలు, బాయిలర్లు, పరిశ్రమ నడిచే విధానం లేఅవుట్ వివరాలతో పరిశ్రమ ఎదుట బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, 24 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 18: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో ఆదేశాలు జారీ చేస్తూ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని యాజమాన్యాలకు సూచించారు. డీఈవో ఆదేశాలతో జర్నలిస్టు అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు కృష్ణ, వీరేందర్ గౌడ్, సునీల్, వసంత్, నాగభూషణం ఉన్నారు.

శిఖం కబ్జా చేస్తే కేసులు

హత్నూర, జూన్ 18: శిఖం భూములు కబ్జాచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఏఈ వైష్ణవి హెచ్చరించారు. మంగళవారం హత్నూర శివారులోని తాలించెరువు, గునుగుకుంట, నక్కలకుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తాలించెరువు శిఖం కబ్జాచేసిన వారితో విచారణ జరిపి హెచ్చరించారు. త్వరలోనే రెవెన్యూ అధికారులతో కలిసి చెరువు, కుంటలపై సర్వే జరిపి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాలించెరువు శిఖం కబ్జాచేసిన వారిపై హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఈ రవికుమార్ పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన

అందోల్, జూన్ 18: వరి, మొక్కజొన్న పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు, అధిక లాభాలు సాధించవచ్చని రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోని అన్నారు. మంగళవారం డాకూర్ రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నారుమడి-యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యకాలిక రకాలైన ఆర్ఎన్ఆర్15048 వరి విత్తనాలు సాగు చేయాలన్నారు. సన్నరకాలైన జేజీఎల్ 31479, దొడ్డు రకాలైన ఆర్ఎన్ఆర్ 31479 రకాలు కూడా తక్కువ వ్యవధిలో చేతికొచ్చే పంట లేనన్నారు. రైతులు పంట అవశేషాలు కాల్చకూడదన్నారు. ఏడీఏ అరుణ, ఏవో విజయరత్న, ఏఈవోలు పాల్గొన్నారు.

సంగారెడ్డి ప్రధాన రహదారిపై నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

'నీట్' మళ్లీ నిర్వహించాలి

సంగారెడ్డి, జూన్ 18: గత నెల 5న నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, పరీక్ష మళ్లీ నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఫలితాల వెల్లడిలో అనేక అనుమానాలున్నాయన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, జిల్లా నాయకులు అర్జున్, శివ, సిద్ధార్థ్, స్వామి, ఆకాశ్, రాజు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అందోల్, జూన్ 18: నీట్‌లో గ్రేస్ మార్కులు రద్దు చేయడం కాదు.. పేపర్ లీకేజీపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. జోగిపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పేపర్ లీకేబాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మాసాన్‌పల్లిలో బాధితులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, జూన్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలతో అందలమెక్కి ప్రజలకు ఇచ్చిన పథకాలను అమలు చేయడంతో విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సొన్నాయిల సామెల్ ఏడాది క్రితం కామారెడ్డి జిల్లా పిట్లం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం బీమా కింద రూ.2 లక్షలు మంజూరు కావడంతో మృతుడి భార్య పోచమ్మకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పాటుపడిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు చేయడంలో నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వానకాలంలో రైతులకు పెట్టుబడి సాయం రైతు భరోసా కింద నిధులు ఇవ్వడం లేదన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మోసకారి ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీస్తారన్నారు. తనకు పదవి ప్రధానం కాదని, పదవి లేకున్నా ప్రజాలతో ఉంటూ సేవనందిస్తానని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్ కుమార్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నారాయణరావు, నాయకులు కిష్టాగౌడ్, సాయిగౌండ, రాంజ్యోషి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు చీరలు పంపిణీ

బొల్లారం, జూన్ 18: బొల్లారం మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సంఘ సేవకుడు, బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి సొంత ఖర్చులతో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని 62 మంది మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అంజిరెడ్డిని నాయకులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ చారి, అఖిల్, మోహిత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు

ఉపాధ్యాయుడు సమ్మిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, జూన్ 18: సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఓరుగంటి సమ్మిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, ఇక నుంచి సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి రాథోడ్, కౌన్సిలర్లు కృష్ణ, చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, సీనియర్ నాయకులు తలారి యాదగిరి, టకూరి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీల సేవలు మరువలేనివి

మునిపల్లిలో ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీపీ శైలజ

మునిపల్లి, జూన్ 18: ఎంపీటీసీల సేవలు మరువలేనివని ఎంపీపీ గౌడిగామ శైలజాశివశంకర్ అన్నారు. మంగళవారం మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్‌తోపాటు ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు మహిళా ఎంపీటీసీలకు చీరసరే అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐదేండ్ల కాలంలో మండల అభివృద్ధికి ఎంపీటీసీలు ఎనలేని కృషి చేశారన్నారు. జూలై 4తో ఎంపీటీసీల పదవీ కాలం పూర్తవుతున్న నేపథ్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినాథ్‌రావు, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

నూతన ప్రధానోపాధ్యాయులకు సన్మానం

కోహీర్, జూన్ 18: జడ్పీ ఉన్నత పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో బస్వరాజ్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు పాఠశాలల నూతన హెచ్‌ఎంలను పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చిరాగ్‌పల్లి హెచ్‌ఎంగా రేణుకాదేవి, మల్చెల్మ హెచ్‌ఎంగా అనిత, అసద్‌గంజ్ హెచ్‌ఎంగా తుల్జాబాయి, మొగుడంపల్లి హెచ్‌ఎంగా వెంకటేశం, ధనాసిరి హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, జాఫర్, ఆనంద్, రమేశ్, నర్సింహులు, జైపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగరాజ్, జైపాల్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలి

మునిపల్లి, జూన్ 18: బడీడు పిల్లలు తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవిధంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మునిపల్లి ఎంఈవో దశరథ్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దగోపులారం, పోల్కంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సర్కారు విద్యకు పెద్దపీట

బొల్లారం, జూన్ 18: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించారని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు విశాలి, సత్యం పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దశరథ్‌రెడ్డి(ఫైల్)

ఝరాసంగం, జూన్ 18: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి కాలిన గాయలతో శవమై కనిపించిన ఘటన మండల పరిధిలోని గుంతమర్పల్లి శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఝరాసంగం పోలీసుల కథనం ప్రకారం.. మునిపల్లి మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దశరథ్ రెడ్డి(44) వ్యవసాయం చేసేవాడు. ప్రతి రోజూ ఉదయం గుంతమర్పల్లి శివారులోని రామ మందిరాన్ని దర్శించుకునేవాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 8 గంటలకు బైక్‌పై వెళ్లిన వ్యక్తి సాయంత్రం రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. అయినా అచూకీ లభించలేదు. మంగళవారం 12 గంటల సమయంలో తాటిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మందిరం పక్కన నీలగిరి తోటలో కాలిన స్థితిలో శవం ఉందని గుర్తించాడు. ఆ మృతదేహం దశరథ్‌రెడ్డిదేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హద్నూర్ ఎస్ఐ రామనాయుడు, ఏఎస్ఐ గంగయ్య తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సంగారెడ్డి నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించారు. క్లూస్ టీం సభ్యులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య అజ్జపల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 18: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్-2025 (ప్రిలిమ్స్, మెయిన్స్) కోసం లాంగ్ టర్మ్ శిక్షణను ఉచితంగా అందించనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 19 నుంచి జూలై 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేస్తామని, జూలై 7న అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18 వరకు శిక్షణ తరగతులు హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మీనగర్‌లో ఉంటాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెలా లాడ్జింగ్, రవాణా కోసం నెలకు రూ.5 వేలు, బుక్ ఫండ్ కింద రూ.5 వేలు ఒకేసారి అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08455-277015, 99495 92991 నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

ప్రజాపాలన దరఖాస్తులను సరిచూసుకోవాలి

రాయికోడ్, జూన్ 18: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దొర్లిన దరఖాస్తులను సరిచూసుకోవాలన్నారు. బుధవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కరెంట్ బిల్, గ్యాస్ సబ్సిడీకి సంబంధించి ఎవరికైనా రాకుంటే అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my clients Sri Jayam Raghavendra, S/o. Jayam Jagadish, Age: 39, Occ: Pvt. Employee, R/o. H.No. 5-161/203/A/1, Sai Anuraag Colony, Near Empire Meadows, Bachupally Village, Mandal, Medchal-Malkajgiri District and Pasupuleti Sai Sandeep, S/o. P.Seenaiah, Age: 34 Yrs., Occ: Pvt. Employee, R/o. Flat No. 103, Tekula Ramreddy Nilayam, Vasanth Nagar Colony, Nizampet Village, Bachupally Mandal, Medchal-Malkajgiri District, Telangana State-500 090, who are purchasing the property ie., open Plot bearing No. 54 in Survey Nos. 54 and 57, total admeasuring 300 Sq.yrds. or 250.83 Sq.mtrs., Muthangi Village, Patancheru Mandal, under Sangareddy SRO. Bounded by North: Plot No. 55, South: Plot No. 53, East: Plot No. 63, West: 50' Wide Road from Smt. Nisha Chegoor, W/o. Chegoor Gopal Krishna Rao, Age: 69 Yrs., Occ: Rtd. Employee, R/o. H.No. 3-4-181/102, Chegoor Apts., Lingampally, Kachiguda, Hyderabad, Telangana.

If any person or persons having any claims, objections or interest in respect of the schedule mentioned property may contact the undersigned within a period of 07 days from the date of this publication, otherwise my client will proceed with the registration and no claim(s) shall be entertained thereafter.

Sd/- **KAMMETA SURESH,** Advocate
B.Sc., LL.B.
Off # 2-11, Bachupally (Vill. & Mdl.),
Nizampet Muncipal Corporation,
Medchal-Malkajgiri (Dist.),
Telangana State-500 090,
Cell: 9700129486, 9959929436.